సాక్షి కామారెడ్డి

సోమవారం ၊ 22 ၊ ఏప్రిల్ ၊ 2024



ఆదరిస్తే అభివృద్ధి చేస్తా

ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. గాంధారిలో ప్రచారంలో పాల్గొన్నారు.

- 8లో ▸



కొనుగోళ్ల నిలిపివేతపై..

బీర్కూర్ సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోళ్లను నిలిపివేయడంపై పౌర సరఫరాల శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

39.9 /20.6

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

25 న బాన్సువాడకు అమిత్ షా రాక



సాక్షి, కామారెడ్డి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈనెల 25 న బాన్సువాడకు రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. అమిత్ షా సభ ఖరారు కావడంతో బీజేపీ నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

యోగా అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



కామారెడ్డి అర్బన్: యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డిని ఎస్ఎస్‌వై యోగా కేంద్రం ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. యోగా, ధ్యానం ప్రచార, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో కృషి చేస్తున్నందుకు ఇటీవల హరిద్వార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాబా రాందేవ్ ఆయనను సన్మానించారని ఎస్ఎస్‌వై ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.అంజయ్య, బాస రఘుకుమార్, ఎల్.లక్ష్మీపతి యాదవ్, కే.సిద్ధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

బాన్సువాడ రూరల్: మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో నాన్ మైనారిటీ కోటా సీట్ల భర్తీ కోసం మంగళవారం లక్కీ డ్రా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బాన్సువాడ మైనారిటీ పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో నిర్వహించే లక్కీ డ్రా కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

క్రికెట్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, నిజామాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ల సహకారంతో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నెల రోజుల సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో ప్రతిభ ఉన్న వారిని జిల్లా టీంగా ఎంపిక చేస్తామని వారిని హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో మూడు నెలల పాటు జరిగే శిక్షణకు పంపిస్తామని కామారెడ్డి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజం అలీఖాన్ తెలిపారు. క్రికెట్‌లో రాణించాలనుకునే క్రీడాకారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ముప్పారపు ఆనంద్, ఉపాధ్యక్షులు విపుల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ. 17 లక్షలు సీజ్

మోర్తాడ్: మోర్తాడ్ మండల కేంద్రంలో 63 నంబరు జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఓ వ్యక్తి వద్ద రూ. 17 లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై జి.అనిల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి బైక్‌పై రాగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అతని వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా అందులో రూ. 17 లక్షలు ఉన్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న డబ్బుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు చెప్పారు.

ముగిసిన టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష




నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష జరిగింది. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఎగ్జామ్ కొనసాగింది. మొత్తం 32 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 7,607 మంది విద్యార్థులకు గాను 6,547 మంది పరీక్ష రాయగా.. 1060 మంది గైర్హాజరయ్యారు.

కారులో హైరానా!

జిల్లాలో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీఆర్ఎస్ పార్టీ.. అధికారం కోల్పోయిన కొద్ది రోజులకే ప్రాభవం కోల్పోతోంది. ఏళ్లుగా గులాబీ జెండాను మోసిన వాళ్లు సైతం కండువా మార్చేస్తున్నారు. అధికార పార్టీలోకి కొందరు, బీజేపీలోకి ఇంకొందరు నేతలు వెళ్లారు. మరికొందరు నేతలు సైతం పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.

– సాక్షి, కామారెడ్డి



- వరుసగా పార్టీని వీడుతున్న నేతలు
- కాంగ్రెస్‌లోకి పెరిగిన వలసలు
- బీజేపీలోకి మరికొందరు..
- జిల్లాలో మారుతున్న సమీకరణాలు

కామారెడ్డి గడ్డ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి దాదాపు రెండు పుష్కరాల పాటు వెన్నుదన్నుగా నిలిచింది. తెలంగాణ ఆవిర్భవించాక జరిగిన ప్రతి ఎన్నికలోనూ ప్రజలు కారు గుర్తుకే ఓటేశారు. ఇతర పార్టీల నేతలను చేర్చుకుని గులాబీ పార్టీ మరింత బలోపేతమైంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు పరిస్థితిని తారుమారు చేశాయి. పలువురు నేతలు కారు దిగి కాంగ్రెస్, బీజేపీలలో చేరారు. ఇటీవలి కాలంలో వలసలు జోరందుకున్నాయి. గ్రామ, మండల స్థాయి బీఆర్ఎస్ నేతలు చాలామంది ఎవరి తోవ వారు చూసుకుంటున్నారు.

వలసలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్..

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సాగుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు.. చేరికలకు ద్వారాలు తెరిచారు. దీంతో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతోపాటు సీనియర్ నేతలు నిమ్మ మోహన్‌రెడ్డి, మామిండ్ల అంజయ్య, హరికిషన్‌గౌడ్ తదితరులు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీబీపేట మండలానికి చెందిన డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు, నాయకులు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరిపోయారు. మాచారెడ్డి మండలానికి చెందిన సింగిల్ విండో చైర్మన్ పూల్‌చంద్ నాయక్‌తో పాటు సొసైటీ పాలకవర్గం కాంగ్రెస్‌లో చేరింది. దోమకొండ విండో చైర్మన్ నాగరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ సదానంద, రైతుబంధు మండలాధ్యక్షుడు తిరుపతిగౌడ్, పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు హస్తం పంచన చేరారు. భిక్కనూరు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్‌లు కిష్టాగౌడ్, సిద్దరాములు, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, విండో చైర్మన్ గంగల్ల భూమయ్య బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయా మండలాలు, పట్టణాల్లో ముఖ్య నేతలుగా గుర్తింపు పొందిన వారే పార్టీని వీడుతుండడంతో రాబోయే రోజుల్లో వలసలు మరింత పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

పోచారం అనుచరులు కూడా..

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అనుచరులు కూడా బీఆర్ఎస్‌ను వీడుతున్నారు. దుర్కి విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ కిషోర్‌యాదవ్, బీర్కూర్ జెడ్పీటీసీ స్వరూప, బాన్సువాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాత బాలకృష్ణ, పలువురు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిచినా.. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో చాలామంది పార్టీని వీడుతున్నట్లు స్పష్టమవుతోంది.

విభేదాలు రచ్చకెక్కి..

అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ భర్త చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో ఇందుప్రియ, చంద్రశేఖర్‌రెడ్డి దంపతులతో పాటు పలువురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అంతటితో ఆగకుండా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బల్దియా రాజకీయాల్లో చక్రం తిప్పారు. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవిపై అవిశ్వాసానికి తెరలేపారు. కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో ఆమెను పదవి నుంచి దింపేశారు. చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ ఎన్నికయ్యేలా చక్రం తిప్పారు. అవిశ్వాసంతో చైర్‌పర్సన్ పదవి కోల్పోయిన నిట్టు జాహ్నవి సైతం బీఆర్ఎస్‌ను వీడనున్నట్లు తెలుస్తోంది. దోమకొండ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డిలు ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు.

అంతటా అదే పరిస్థితి..

బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేసిన గాంధారి మాజీ జెడ్పీటీసీ తానాజీరావ్ ఇటీవల బీజేపీలో చేరారు. మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు కాషాయ కండువా కప్పుకున్నారు. ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, గాంధారి విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, లింగంపేట ఎంపీపీ గరీబున్నీసా బేగం, జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, తాడ్వాయి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే రామారెడ్డి వైస్ ఎంపీపీ రవీందర్ రావు, రాజంపేట మండలం అర్గొండ విండో చైర్మన్ కంది శివరాములు కాంగ్రెస్‌లో చేరారు. జుక్కల్ సొసైటీ చైర్మన్ శివానంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయాగౌడ్, పలువురు సర్పంచ్‌లు బీజేపీలో చేరారు. పిట్లం మండలం చిల్లర్గి సొసైటీ చైర్మన్ శపథంరెడ్డి, మద్నూర్ విండో చైర్మన్ శ్రీనివాస్‌పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, ఎంపీపీ లక్ష్మీబాయి, వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, బిచ్కుందకు చెందిన జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ అసద్ అలీ, పెద్ద కొడప్‌గల్ మండలానికి చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు.

జోరందుకోనున్న నామినేషన్ల పర్వం

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఆయన అనుచరులు ఒక సెట్టు అందించారు. మరో ఆరుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. దీంతో నామినేషన్ల సంఖ్య ఎనిమిదికి చేరింది. సోమవారం బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొననున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ ఈనెల 24న నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతారావు, కే.మదన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొననున్నారు.

హోరెత్తుతున్న ప్రచారం

ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ప్రచారం జోరందుకుంటోంది. ఆదివారం రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. గాంధారి మండల కేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కే.మదన్‌మోహన్ రావుతో కలిసి సురేశ్ షెట్కార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోపాటు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడా ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి

- సభాస్థలిని పరిశీలించిన షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డి జనజాతర సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణు ఆదివారం పరిశీలించారు. సభకు వచ్చే వారి కోసం చేస్తున్న ఏర్పాట్ల గురించి కాంగ్రెస్ నేతలను అడిగి తెలుసుకున్నారు. సభలో పాల్గొనే కార్యకర్తలు, ప్రజల కోసం తగిన వసతులు కల్పించాలని సూచించారు. సభ కోసం నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్ నుంచి ఎక్కువగా జనసమీకరణ చేస్తున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్నం నామినేషన్ వేయనున్న జీవన్‌రెడ్డి

నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నేతలు వెళ్లనున్నారు. అనంతరం జరగనున్న బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారు.

భారీ బందోబస్తు

సీఎం సభాస్థలిని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అంతకుముందు జీజీ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అక్కడ నుంచి సీఎం రోడ్డుమార్గంలో సభాస్థలానికి వచ్చే మార్గాలను పరిశీలించారు. జీజీ కాలేజీ నుంచి పాత కలెక్టరేట్ వరకు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్లు, హోంగార్డులు 300 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు.

బీబీపాటిల్ ఏం చేశారో చెప్పాలి

- కాంగ్రెస్‌తోనే సంక్షేమం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



రెడ్డిపేటలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ, పక్కన ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్

రామారెడ్డి: జహీరాబాద్ ఎంపీగా పదేళ్లపాటు పనిచేసిన బీబీ పాటిల్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. ఆదివారం రెడ్డిపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహావసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రు.500లకే గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్య సదుపాయం తదితర పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌నుంచి ఏటా ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా అందిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రెడ్డిపేటకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ జహీరాబాద్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, మద్దికుంట మాజీ సర్పంచ్ తోట గంగయ్య, దుప్పల బాల్‌లక్ష్మి, రాజు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతి గ్రామంలో మెజారిటీ రావాలి’



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ తీసుకురావాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కార్యకర్తలకు సూచించారు. కామారెడ్డిలోని ఆయన నివాసంలో ఆదివారం సదాశివనగర్ మండలానికి చెందిన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. గతంలో నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో అప్పగించిన బాధ్యతలు, సాధించిన ప్రగతి, ప్రచార కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి వ్యతిరేకంగా పని చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి కార్యకర్త వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే ద్వారానే అందుతాయనే విషయాన్ని ప్రతి ఓటరుకు తెలియజేయాలన్నారు. ఒక్కో కార్యకర్త 50 నుంచి 60 ఓట్లు వేయించాలన్నారు. సమావేశంలో సదాశివనగర్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కల మృత్యువాత

- విద్యుత్ స్తంభంపై పడిన పిడుగు
- కరెంట్ వైరు తెగిపడడంతో మరణించిన మూడు నక్కలు
- నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలంలో ఘటన

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రకృతి వైపరీత్యాలకు వన్యప్రాణులు కూడా బలి అవుతున్నాయి. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు చాలాచోట్ల పిడుగులు పడ్డాయి. అయితే, డొంకేశ్వర్ మండలంలో పిడుగు కారణంగా తెగిపడిన విద్యుత్‌తీగ మూడు నక్కలను బలి తీసుకుంది. ఈ ఘటన రెండు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. స్థానిక డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతం కావడంతో దగ్గరలోని గ్రామాలు, పంట పొలాల్లో జింకలతో పాటు నక్కలు, ఇతర వన్యప్రాణులు ఎక్కువగా సంచరిస్తాయి. అయితే.. రెండు రోజుల క్రితం డొంకేశ్వర్ మండలంలో భారీ శబ్దాలతో పిడుగులు పడ్డాయి. డొంకేశ్వర్, నూత్‌పల్లి గ్రామాల శివారులోని పంట పొలాల మధ్య ఉన్న ఖాళీ ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ లైన్ కలిగిన కరెంట్ స్తంభంపై బలమైన పిడుగు పడింది. పిడుగు ధాటికి కరెంట్ స్తంభం ధ్వంసమైంది. విద్యుత్ సరఫరా ఉన్న కరెంట్ తీగ కూడా తెగి కిందపడి ముక్కలైంది.

అదే సమయంలో ఇటువైపు సంచరిస్తున్న మూడు నక్కలపై పడడంతో అక్కడే ప్రాణాలు విడిచాయి. నక్కల కళేబరాలను చూసిన రైతులు ఆదివారం ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. స్థానిక డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని నక్కలను పరిశీలించారు. స్థానిక వెటర్నరీ డాక్టర్ కృష్ణ సహాయంతో వాటికి పోస్టుమార్టం నిర్వహించి అక్కడే దహనం చేశారు.



నక్కలకు పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యుడు



పిడుగు పడడంతో ధ్వంసమైన విద్యుత్ స్తంభం

పత్తాలేని పరిశ్రమలు

- పేరుకే లక్కంపల్లి సెజ్
- ప్రభుత్వాలు మారినా మారని పరిస్థితులు
- ఎన్నికల్లో ప్రచారానికి వాడుకుంటున్న నాయకులు
- గతంలో ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకునేనా!?

నందిపేట్(ఆర్మూర్): జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా ఉండడంతో పాటు వైవిధ్యమైన పంటలతో మంచి దిగుబడులు సాధిస్తుండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు గాను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయ ఆధారిత పరిశ్రమల కోసం సెజ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం 2008 సంవత్సరంలో లక్కంపల్లి, బజార్‌కొత్తూర్ శివారులో 437.05 ఎకరాలు సేకరించారు. ఇందులో కొంత పనికిరాని భూమి ఉండడంతో 371.17 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 171.17 ఎకరాలు స్మార్ట్ ఆగ్రోకు విక్రయించారు. ఇందులో పసుపు కర్కుమిన్ యూనిట్ ఏర్పాటు చేశారు. తర్వాత ఆరు గోదాములు ఏర్పాటయ్యాయి. మిగతా 200 ఎకరాలు ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఉన్నాయి.

16 ఏళ్లు గడుస్తున్నా..

లక్కంపల్లిలో సెజ్ ఏర్పాటు చేసి 16 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క యూనిట్ కూడా ఏర్పాటు చేయలేదు. 17 నవంబర్ 2015న బీజేపీ ప్రభుత్వంలో ఉన్న కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి హరిసిమ్రత్ కౌర్ బాదల్ చేతుల మీదుగా ప్రారంభమైన సెజ్‌ను మాజీ ఎంపీ కవితతో పాటు, ప్రస్తుత ఎంపీ ధర్మపురి అర్వింద్ పలుమార్లు సందర్శించి పలు వాగ్దానాలు ఇచ్చారు. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2023 మార్చి 17న సెజ్‌ను సందర్శించి ఇక్కడ పరిశ్రమలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే బీఆర్ఎస్ నేతలు కమీషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2017 నవంబర్ 16న పతంజలి గ్రూప్‌తో పాటు పలువురు పెట్టుబడి దారులు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చినా.. ఇక్కడికి వచ్చిన తర్వాత పరిస్థితులు చూసి విముఖత చూపించారు.

ఎన్నికల సమయంలో ప్రచారం

16 ఏళ్ల క్రితం పరిశ్రమల కోసం లక్కంపల్లి సెజ్ ఏర్పాటు చేయగా నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే సెజ్‌ను ప్రచారం అస్త్రంగా వాడుకుంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాయకులు తమను గెలిపిస్తే.. పరిశ్రమలు నెలకొల్పుతామని, ఇక్కడి యు వతకు, ప్రజలకు న్యాయం చేస్తామని హామీ లు ఇస్తూ మరుస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సైతం తమను గెలిపిస్తే సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీలు కురిపిస్తున్నారు. నాయకులు మారినా.. ప్రభుత్వాలు మారినా సెజ్‌లో పరిస్థితులు మాత్రం మారడం లేదు. ఇక్కడ పరిశ్రమల జాడ కనిపించడంలేదు.

క్లుప్తంగా

ప్రశాంతంగా బీఎల్‌వీ సెట్‌ ప్రవేశ పరీక్ష



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభా(సీవోఈ) పాఠశాల/కళాశాలలో ఆదివారం టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌, టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లకు సంబంధించి బ్యాక్‌లాగ్‌ వేకెన్సీ(బీఎల్‌వీ) సెట్‌ -2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్‌ బి.సంగీత తెలిపారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకు జరిగిన పరీక్షకు 282 మంది విద్యార్థులు హాజరు కాగా 39 మంది గైర్హాజరైనట్లు డీసీవో తెలిపారు. డిపార్ట్‌మెంటల్‌ ఆఫీసర్‌గా కే.లావణ్య వ్యవహరించారు. నిజామాబాద్‌ ఆర్‌సీవో కే.అలివేలు పరీక్షా కేంద్రాన్ని సందర్శించినట్లు డీసీవో తెలిపారు.

వ్యవసాయ పనులకు ముహూర్తాలు



మద్నూర్‌(జుక్కల్‌) : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మంచిరోజు ఉందని బ్రాహ్మణులు సూచించడంతో రైతులు వ్యవసాయ పనులకు ముహూర్తాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ భూమిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడ్లకు పూజలు చేసి నైవేద్యాలు తినిపించి ఈసారి పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరుకున్నారు. మరికొందరు రైతులు హనుమాన్‌ జయంతి రోజున వ్యవసాయ పనులకు ముహూర్తాలు చేస్తారని రైతులు తెలిపారు.

వెన్నతో అంజన్నకు అలంకరణ



కామారెడ్డి టౌన్‌ : పట్టణంలోని గంజువర్తక సంఘం ధర్మశాలలో ఆంజనేయ స్వామికి ఆదివారం 5 కిలల వెన్నతో విగ్రహాన్ని అలంకరించారు. ఆలయంలో జరుగుతున్న నాగదేవల విగ్రవ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా 108 రకాల ద్రవ్యాలతో మహాపూర్ణాహుతి పూజలు చేపట్టారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు సాయిదీక్షిత్‌, గంజ్‌ వర్తక సంఘ అధ్యక్షులు యాదరాజేశ్వర్‌ రావు, పార్శి రాజు తదితరులున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



కామారెడ్డి రూరల్‌ : కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో మాలధారులు ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్‌ చాలీసా చదివారు. హనుమాన్‌ నామస్మరణతో ఆలయంలో మార్మోగింది. ఈ కార్యక్రమంలో మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

పెరిగిన వ్యయ పరిమితి

- ఎన్నికల ప్రచారం కోసం రూ.95 లక్షల వరకు ఎంపీ అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు
- గత పరిమితి రూ.70 లక్షలే
- పెరిగిన ధరలను పరిగణనలోకి తీసుకుని రూ.25 లక్షలు పెంచిన సీఈసీ



సాక్షి తెలంగాణ ఎలక్షన్‌ 2024

మోర్తాడ్‌(బాల్కొండ): లోక్‌సభ ఎన్నికల్లో ఆయా స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచారం కోసం రూ.95 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని కేంద్ర ఎన్నికల కమిషన్‌(సీఈసీ) నిర్దేశించింది. 2019 సాధారణ ఎన్నికల సందర్భంలో అభ్య ర్థులు రూ.70 లక్షల వరకే ఖర్చు చేయాలని పరిమి తి విధించారు. ధరలు పెరగడం వల్ల వ్యయ పరిమితిని పెంచుతూ ఎన్నికల కమిషన్‌ నిర్ణయం తీసుకుంది. గతంలో కంటే ఒక్కో అభ్యర్థి రూ.25లక్షలు ఎక్కువగా ఖర్చు చేసుకోవచ్చు. 2014లో ఎంపీ అభ్యర్థుల ప్రచార ఖర్చు పరిమితి రూ.40 లక్షలు ఉండేది. ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని ఒక్కో ఎన్నికల సందర్భంలో వ్యయ పరిమితిని పెంచుతూ ఎన్నికల కమిషన్‌ నిర్ణయం తీసుకుంది. అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా సభ లు, సమావేశాలు నిర్వహించడం, వాల్‌ రైటింగ్‌, పోస్టర్లు, స్టిక్కర్లు, వాహనాల అద్దె, డీజిల్‌, పెట్రోల్‌ కొనుగోలు, తమకు మద్దతుగా వచ్చే కార్యకర్తలకు టిఫిన్‌, భోజనాల ఖర్చు, మైక్‌ సెట్‌ ఏర్పాటు ఇతరత్రా వాటి కోసం అభ్యర్థులు ఖర్చు చేసుకోవడానికి సీఈసీ అనుమతి ఇచ్చింది. నామినేషన్‌ వేసిన నాటి నుంచి పోలింగ్‌ ముగిసేవరకు అభ్యర్థులు రోజువారిగా ఎన్నికల కమిషన్‌కు ఖర్చుల లెక్కలను చూపించాల్సి ఉంటుంది. అభ్యర్థి ఏ పార్లమెంట్‌ స్థానం నుంచి పోటీ చేస్తే అక్కడి రిటర్నింగ్‌ అధికారికి తమ ప్రచారం ఖర్చు లెక్కలను బిల్లులతో సహా అందించాల్సి ఉంది. పోలింగ్‌ ముగిసేనాటికి ఏ అభ్యర్థి ఎంత మొత్తంలో ఖర్చు చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

కవితకు పట్టిన గతే అర్వింద్‌కు పడుతుంది



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ అభ్యర్థి జీవన్‌రెడ్డి, పక్కన ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హందాన్‌

- చక్కెర పరిశ్రమను తెరిపిస్తామని అర్వింద్‌ కొత్త నాటకం
- ఆగస్టు 15 వరకు నగరంలో సిటీ బస్సులు నడిపిస్తాం
- నామినేషన్‌ ర్యాలీకి తరలిరావాలి
- మీడియా సమావేశంలో కాంగ్రెస్‌ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: గత ఎంపీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ కుమార్తె కవితకు పట్టిన గతే ఈ లోకసభ ఎన్నికలలో ఎంపీ అర్వింద్‌కు పడుతుందని కాంగ్రెస్‌ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో ఆయన మాట్లాడారు. ఎంపీగా ఉన్న సమయంలో కవిత నిజామాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలో అభివృద్ధి చేయలేదని, అందుకనే ఓడిపోయిందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చినా.. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి ఐదు గ్యారెంటీలను అమలు చేశారని తెలిపారు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పథకాల అమలు 90 రోజులలో జరగలేవన్నారు. ఇది కేవలం సీఎం రేవంత్‌రెడ్డికే ఘనత దక్కుతుందన్నారు. ఎంపీ అర్వింద్‌ పసుపుబోర్డును తెస్తానని బాండ్‌ పేపర్‌ రాసి ఇచ్చినా ఇప్పటి వరకు పసుపు బోర్డు కాగితాలకే పరిమితమైందన్నారు. ఇప్పుడు ఎంపీగా అవకాశం కల్పిస్తే చక్కెర పరిశ్రమలను తెరిపిస్తానని నాటకం ఆడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌ ఎన్నికల హామీలో భాగంగా నిజాంషుగర్స్‌ ఫ్యాక్టరీని తెరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. ఈ కమిటీ ప్రకారం త్వరలోనే చక్కెర పరిశ్రమలను తెరిపిస్తామని తెలిపారు. ఎంపీ అర్వింద్‌కు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నా నిజామాబాద్‌ పార్లమెంట్‌పై నిర్లక్ష్యం వహించారన్నారు.

ఢిల్లీకి లింకు లేకుండా పోయింది

ఆర్మూర్‌ నుంచి ఆదిలాబాద్‌ రైల్వేలైన్‌ లేకపోవడంతో ఢిల్లీకి లింకు లేకుండా పోయిందన్నారు. అలాగే బోధన్‌, బీదర్‌ రైల్వే లైన్‌కు ఎందుకు నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. ముంబై నుంచి కరీంనగర్‌కు రైలు ఉన్నప్పటికీ జగిత్యాల రైల్వేస్టేషన్‌లో హాల్ట్‌ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు పెట్రోల్‌ స్టాక్‌ పాయింట్‌ ఉన్నప్పటికి ఇప్పటి వరకు తీసుకురాలేదన్నారు. మంచిర్యాల నుంచి పెట్రోల్‌, డీజిల్‌ తీసుకురావడంతో లీటర్‌కు రూ.2 అదనపు ఛార్జీ పడుతుందని తెలిపారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్న సమయంలో నిజామాబాద్‌ సిటీ బస్సులు ఏర్పాటు చేయలేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆగస్టు 15 వరకు నిజామాబాద్‌లో సిటీ బస్సులను ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కాంగ్రెస్‌ పార్టీకి ఓటు వేసి ఈ ఎన్నికలలో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు కేశవేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, కాంగ్రెస్‌ నేతలు రాజనరేందర్‌గౌడ్‌, వైశాఖ సంతోష్‌, రామర్తిగోపి, వీక్కియాదవ్‌, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల నిలిపివేతపై విచారణ

సాక్షి ఎఫెక్ట్‌..



బీర్కూర్‌ సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోళ్ల నిలిపివేతపై విచారణ చేస్తున్న అధికారులు

బాన్సువాడ : బీర్కూర్‌ సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోళ్ల నిలిపివేతపై ఆదివారం సివిల్‌ సప్లయ్‌ అధికారులు విచారణ చేపట్టారు. 'సాక్షి'లో వచ్చిన 'బీర్కూర్‌లో కొనుగోలు కేంద్రాల మూసివేత' కథనానికి స్పందించిన జిల్లా అధికారులు బీర్కూర్‌ సొసైటీని సందర్శించారు. బీర్కూర్‌ సొసైటీ పరిధిలో బరంగెడ్గి గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. ప్రైవేటు వ్యాపారులతో సొసైటీ అధికారులు కుమ్మక్కై రైతులు పండించిన పంటను ప్రభుత్వ పరంగా కొనుగోళ్లు చేయడం లేదని, చేసేదేమి లేక రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తే తక్కువ ధరకు ధాన్యంను కొనుగోలు చేస్తున్నారని రైతులు అధికారులకు సూచించారు. అధికారులు అక్కడి నుంచి ప్రైవేటు మిల్లర్ల వద్దకు వెళ్లారు. క్వింటాలుకు 5 నుంచి 7 కిలోల తరుగు పేరిట రైతులను మోసం చేస్తున్నారని, పిర్యాదు వచ్చినట్లు అధికారులు మిల్లర్ల యజమానులకు సూచించారు. మిల్లర్లు ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యంను కొనుగోలు చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. సొసైటీ పరిధిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీర్కూర్‌ సొసైటీ కార్యదర్శి విఠల్‌కు సూచించారు. విచారణకు వచ్చిన వారిలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌ బాబు, సివిల్‌ సప్లయి కార్పొరేషన్‌ డీఎం నిత్యానంద్‌, సివిల్‌ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ సురేష్‌ బాబు ఉన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన





పాత కలెక్టరేట్‌ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టేజ్‌, పరిశీలిస్తున్న జీవన్‌ రెడ్డి, షబ్బీర్‌ అలీ, సుదర్శన్‌ రెడ్డి

సాక్షి నెట్‌వర్క్‌:సీఎం రేవంత్‌రెడ్డి సభ కోసం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్‌ నేతలు సభాస్థలాన్ని పరిశీలించారు. ప్రజల కోసం షామియానాలు, నీటి వసతి తదితర ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

చైన్‌ మిషిన్లకు పెరిగిన గిరాకీ



డొంకేశ్వర్‌: అకాల వర్షాలతో వరికోతలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వడగళ్ల భయానికి రైతులు పంటను త్వరత్వరగా కోసేస్తున్నారు. ఐతే, పొలాల్లో టైర్లతో నడిచే యంత్రాలు దిగబడుతున్నాయి. దీంతో పొలాల్లో సులభంగా నడిచే చైన్‌ హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నారు. తద్వారా జిల్లా వ్యాప్తంగా చైన్‌తో నడిచే కోత మిషిన్లకు డిమాండ్‌ ఏర్పడింది. ఈ హార్వెస్టర్లకు గంటకు రూ.2,500పైగా రైతులు వెచ్చించి పంటను కోయిస్తున్నారు.

'ఆదరిస్తే అభివృద్ధి చేస్తా'



ప్రచారం చేస్తున్న జహీరాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌

గాంధారి(ఎల్లారెడ్డి) : చేయి గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని అభివృద్ధి చేస్తామని జహీరాబాద్‌ పార్లమెంట్‌ నియోజక వర్గం కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌ అన్నారు. ఆదివారం ఆయన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ రావుతో కలిసి మండల కేంద్రంలో ప్రచారం చేశారు. మండలంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన పనులే ఉన్నాయని, గత పదేళ్ల బీబీ పాటిల్‌ ఎంపీగా ఉండీ చేసిందేమీ లేదన్నారు. తనను గెలిపిస్తే బాన్సువాడ నుంచి సదాశివనగర్‌ పద్మాజీవాడి వరకు రోడ్డును అభివృద్ధి చేసి జాతీయ రహదారి హోదా తెస్తానన్నారు. ఆర్యక్షత్రీయులను ఓబీసీలో చేర్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌ మోహన్‌ తాను జోడెడ్లలాగా కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

వైఎస్సార్‌ హయాంలోనే ఒరిజినల్‌ కాంగ్రెస్‌ పార్టీ

- బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌

ఎడపల్లి (బోధన్‌): వైఎస్సార్‌ హయాంలోనే ఒరిజినల్‌ కాంగ్రెస్‌ పార్టీ ఉందని బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్లో బీఆర్‌ఎస్‌ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో పార్టీ కోసం పని చేసే నాయకులు లేరని, కేవల పదవుల కోసం పాకులాడే వారే ఉన్నారని చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌ నేతలు బీజేపీతో జత కట్టి కవితను ఓడించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప నాలుగు నెలల కాలంలో కాంగ్రెస్‌ పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ ఇవ్వలేదని చెప్పారు. ఎంపీ అర్వింద్‌ ఎన్నికలలో గెలిపించిన తర్వాత నిజామాబాద్‌ పార్లమెంట్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పసుపు బోర్డు తీసుకువస్తానని చెప్పి ఇంత వరకు తీసుకురాలేదన్నారు. ఎంపీగా అభివృద్ధి ఎక్కడ చేశారో చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఎంపీ ఎన్నికలలో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజల సమస్యలపై పార్లమెంట్లో పోరాడి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. మీరు బీఆర్‌ఎస్‌ కార్యకర్తలను ఇబ్బందిపెడితే ఊరుకునేది లేదని బోధన్‌ ఎమ్మెల్యేను హెచ్చరించారు. ఆయన పేరును డైరీలో రాసుకుంటున్నానని పేర్కొన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌ రెడ్డి, బిగాల గణేష్‌ గుప్తా, మాజీ ఎమ్మెల్యే షకీల్‌ సతీమణి అయేషా ఫాతిమా తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాల్గొన్న సీఎస్‌ఐ పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఐ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంతో కలుసుకున్నారు. 2000– 01 బ్యాచ్‌ టెన్త్‌ విద్యార్థులు ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి రోజంతా సంతోషంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు అబిద్‌, రాజు, చాంద్‌పాషా, శ్రీనివాస్‌, రాజ్యలక్ష్మి, సవిత, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి ఖిల్లా జెడ్పీహెచ్‌ఎస్‌ పూర్వ విద్యార్థులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకొని ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను మధురస్మృతులను తలుచుకుని ఆనందంగా గడిపారు.



డిచ్‌పల్లి ఖిల్లా జెడ్పీహెచ్‌ఎస్‌ 2002-03 బ్యాచ్‌ టెన్త్‌ విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్రైం కార్నర్‌

విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి



నవీన్‌ మృతదేహం

సిరికొండ: దుప్య తండాకు చెందిన మాలావత్‌ నవీన్‌(36) అనే వ్యక్తి ఆదివారం విద్యుత్‌ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై రమేష్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. నవీన్‌ తన ట్రాక్టర్‌ను తీసుకొని మొరం తోలడానికి వెళ్లాడు. ప్రభు అనే వ్యక్తికి చెందిన ప్లాట్‌లో మొరం ఖాళీ చేస్తుండగా ట్రాలీ బోల్తా పడింది. నవీన్‌ ఇనుప రాడ్‌ను తీసుకొని ట్రాలీని సరి చేస్తుండగా పైన ఉన్న విద్యుత్‌ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. నవీన్‌ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నవీన్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇరువురికి గాయాలు

ఇందల్వాయి: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇందల్వాయి తండాకు చెందిన గోపాల్‌ నాయక్‌ వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా.. ఇందల్వాయి వైపు నుంచి తండా వైపు వెళ్తున్న మరో బైక్‌ను ఆకస్మికంగా ఢీకొంది. ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు



మద్నూర్‌(జుక్కల్‌): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, డబ్బును ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మండలంలోని రాష్ట్ర సరిహద్దు సలాబత్‌పూర్‌ వద్ద ఆదివారం పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, మద్యం ఎర చూపుతారనే ఉద్దేశంతో ఇతర ప్రాంతాల నుంచి తరలించకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని వారు తెలిపారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డి: సోమార్‌పేట్‌ గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్‌ ఆదివారం తెలిపారు. సోమార్‌పేట్‌కు చెందిన మహిళ ఈ నెల 20న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని, బంధువులు, తెలిసివారి వద్ద విచారించగా ఆచూకీ లభించకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత


నవీపేట: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.1,60,000ల నగదును పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపారు. నిజామాబాద్‌ నుంచి మహారాష్ట్రకు బైక్‌పై వెళ్తున్న పర్వేజ్‌ కతిక్‌ దగ్గర రూ.65 వేలు, నవీపేటకు చెందిన హర్షద్‌ ఖురేషి దగ్గర రూ.95 వేలను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ నగదుకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్‌ చేశామన్నారు. ఎన్నికల కోడ్‌ నిబంధనల మేరకు పట్టుకున్న నగదును కోర్టుకు అప్పగిస్తామని తెలిపారు.

మైనర్‌పై పోక్సో కేసు నమోదు

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మంచిప్పకు చెందిన ఓ మైనర్‌ను పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్‌ ఆదివారం తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. మంచిప్పకు చెందిన ఓ మైనర్‌ బాలికను ఐదు రోజుల క్రితం ఇంట్లో నుంచి మైనర్‌ బాలుడు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడని వెల్లడించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. దర్యాప్తులో నిజాలు ఒప్పుకోవడంతో నిందితుడిని రిమాండ్‌ తరలించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదస్థలంలో దెబ్బతిన్న ఆటో, బైక్‌



మృతుడు తమ్మల రాజు(ఫైల్‌)

కామారెడ్డి క్రైం: ఆటో అదుపు తప్పి బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని లింగాపూర్‌ శివారులో ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం జరిగింది. వివరాలు.. తాడ్వాయికి చెందిన తమ్మల రాజు(40) ప్రతి రోజు కామారెడ్డి మార్కెట్‌ నుంచి ఆటోలో కూరగాయలు తీసుకుని తాడ్వాయికి తీసుకువెళ్తాడు. ఎప్పటిలాగే ఆటోలో కూరగాయలు నింపుకుని వెళ్తుండగా ఆటో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఆపై అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్ల పొదల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజుతోపాటు బైక్‌పై ప్రయాణిస్తున్న లింగంపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన సోదరులు దాసారాం రాములు, లక్ష్మణ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. కొద్దిసేపటికే రాజు మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.